రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్
వార్త







# సీజన్‌కు ముందే.. షాక్..



## రైతన్నపై కాంప్లెక్స్ భారం!
## ఎరువుల ధర బస్తాకు రూ.350 పెంపు
## అన్నదాతలకు పెట్టుబడి కష్టాలు
## ఎరువుల కంపెనీల ఇష్టారాజ్యం..
## కేంద్రం నిరక్ష్యంపై రైతు సంఘాల ఆందోళన

**ఒకవైపు పండించిన ధాన్యానికి, మక్కజొన్నకు గిట్టుబాటు ధర దక్కక నష్టాల్లో కూరుకుపోయిన రైతాంగాన్ని.. రాబోయే వానకాలం సీజన్ ముందే ఎరువుల ధరల పెంపు మరింత కోలుకోలేని దెబ్బ తీసింది. జూన్ నుంచి సాగు పనులు ప్రారంభం కానున్న తరుణంలో కంపెనీలు కాంప్లెక్స్ ఎరువుల ధరలను బస్తాకు రూ.300 నుండి రూ.350 వరకు పెంచేయడంతో అన్నదాతలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.**

**రంగారెడ్డి అర్బన్, మే 17, ప్రభాత వార్త:** ఒకవైపు పండించిన ధాన్యం, మక్కజొన్నకు గిట్టుబాటు ధర లేక నష్టాల్లో కూరుకుపోయిన రైతన్నపై ఇప్పుడు ఎరువుల ధరల పెంపు మరో భారంగా మారింది. జూన్ నుంచి వానకాలం సాగు పనులు ప్రారంభ మవ్వాల్సి ఉండగా, ఈ సీజన్ సమీపి స్తున్న వేళ.. కాంప్లెక్స్ ఎరువుల ధరలను కంపెనీలు భారీగా పెంచ డంతో రైతుల్లో తీవ్ర ఆందోళన నెల కొంది. 50 కిలోల కాంప్లెక్స్ ఎరువుల బస్తాపై సగటున రూ. 300 నుండి రూ. 350 వరకు ధరలు పెరగడం వల్ల ఈ సీజన్‌లో పెట్టుబడి ఖర్చులు అమాంతం పెరగనున్నాయి. ము ఖ్యంగా 20-20-0-13, 24-24 -0, 10-26-26 వంటి ఎరువులపై ఈ భారం ఎక్కువగా పడింది. ఇటీ వల వరకు రూ. 1,500 ఉన్న 20-20-0-13 బస్తా ధర ఇప్పుడు ఏకంగా రూ. 2,150కు చేరింది. అలాగే 16-16-16, 15-15-15-09, 20-20-0-13 రకాలపై కూడా వందల రూపాయల పెంపు నమోదైనప్పటికీ, యూరియా ధర మాత్రం ఎలాంటి మార్పు లేకుండా రూ. 266 గానే కొనసాగుతోంది. ఇప్పటికే యాసంగి పంటలను అమ్ముకునేందుకు రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు.

**'మద్దతు' లేకపోయినా తప్పని భారం**

కొనుగోలు కేంద్రాల వద్ద రోజుల తరబడి ఎదురుచూసినా ప్రభుత్వం పంటలను సకాలంలో కొనడం లేదని, దీనివల్ల వ్యాపారులు కనీస మద్దతు ధర కంటే రూ. 300 నుండి రూ. 400 తక్కువకే కొనుగోలు చేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలా పాత పంట అమ్ముడు కాకముందే, కొత్త సీజన్ పెట్టుబడుల భారం మోయాల్సి రావడంతో రైతులు తీవ్ర ఆర్థిక ఒత్తిడికి లోనవుతున్నారు. ముడిసరుకుల ధరలు, దిగుమతి ఖర్చులు, పశ్చిమాసియా యుద్ధ పరిస్థితులను కారణాలుగా చూపుతూ ఎరువుల కంపెనీలు ధరలు పెంచుతున్నాయని, యూరియా మినహా ఇతర ఎరువులపై కేంద్ర ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీ స్థిరంగా ఉండటంతో కంపెనీలు తమ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాయని రైతు సంఘాలు ఆరోపిస్తున్నాయి. ఎరువుల ధరలు భారీగా పెరగడం వల్ల రైతులు అవసరమైన మోతాదులో వాటిని వినియోగించలేరని, దీనివల్ల పంట దిగుబడులు తగ్గే ప్రమాదం ఉందని వ్యవసాయ నిపుణులు హెచ్చరిస్తున్నారు. మరోవైపు జిల్లాలో ప్రతి ఏడాది కాంప్లెక్స్ ఎరువుల వినియోగం పెరుగుతూ వస్తోంది. వరి, మొక్కజొన్న, పత్తి, కూరగాయల సాగు విస్తీర్ణం అధికంగా ఉండటంతో రైతులు 20-20-0-13, 24-24-0, 28-28 వంటి కాంప్లెక్స్ ఎరువులను ఎక్కువగా వాడుతున్నారు. గత ఖరీఫ్ సీజన్లలో సుమారు 38 వేల మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్ ఎరువులు వినియోగించబడగా, అందులో 20-20-0-13 ఎరువుల వినియోగమే అత్యధికంగా నమోదైంది. నేలల్లో పోషక లోపాలను దృష్టిలో పెట్టుకుని రైతులు సమతుల ఎరువుల వినియోగంపై ఎక్కువ ఆసక్తి చూపినట్లు అధికారులు చెబుతున్నారు. ఈ ఏడాది వానాకాలంలో సాగు విస్తీర్ణం మరింత పెరిగే అవకాశముండటంతో 2026 ఖరీఫ్ సీజన్లో జిల్లాలో సుమారు 42 వేల మెట్రిక్ టన్నుల వరకు కాంప్లెక్స్ ఎరువుల అవసరం ఉండొచ్చని వ్యవసాయ శాఖ అంచనా వేస్తోంది. ముఖ్యంగా 20-20-0-13 ఎరువులకు అధిక డిమాండ్ ఉంటుందని భావిస్తున్నారు. రైతులకు సకాలంలో ఎరువులు అందుబాటులో ఉండేలా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని, మండల కేంద్రాలు, రైతు సేవా సహకార సంఘాలు, ప్రైవేట్ డీలర్ల వద్ద అవసరమైన నిల్వలు ఉంచే చర్యలు చేపడుతున్నట్లు అధికారులు వెల్లడించారు.

# వడగండ్ల బీభత్సం

## ఈర్లపల్లిలో నేల మట్టమైన వరి పంట

**దౌల్తాబాద్, మే 19, ప్రభాతవార్త:** కొడంగల్ నియోజకవర్గం దౌల్తాబాద్ మండలంలోని ఈర్లపల్లి గ్రామంలో మంగళవారం సాయంత్రం భారీ ఈదురు గాలులు, వడగండ్ల వాన బీభత్సం సృష్టించాయి. ఈర్లపల్లి గ్రామానికి చెందిన రైతు నడింబాయి కృష్ణరెడ్డికి చెందిన 10 ఎకరాల వరి పంట పూర్తిగా నేలమట్టమైంది. ఎంతో కష్టపడి సాగు చేసిన పంట, కోతకు వచ్చే సమయంలో కళ్లముందే నాశనం కావడంతో రైతు కృష్ణరెడ్డి తీవ్ర ఆవేదనకు లోనయ్యారు. పెట్టుబడి పోయి దిక్కుతోచని స్థితిలో ఉన్న తమను ప్రభుత్వం తక్షణమే స్పందించి, నష్టపరిహారం అందించి ఆదుకోవాలని ఆయన కన్నీటితో వేడుకుంటున్నారు.



నేలమట్టమైన వరి పంట

**అరటిపంటకు అపార నష్టం**

**మర్పల్లి మే 19 ప్రభాతవార్త :** మర్పల్లి మండలంలో సోమవారం నాడు రాత్రి కురిసిన అకాల వర్షానికి చేతికి అంది వచ్చిన అరటి, జొన్న పంటలు నేలకు వరగి రైతులకు అపార నష్టాన్ని మిగిలించింది. ఒకవైపు ఎండలు, మారోవైపు వానలతో ప్రజలను, రైతులను ప్రకృతి ఉక్కిరి బిక్కిరి చేస్తోంది. వ్యవసాయ రంగాన్ని



మర్పల్లిలో ధ్వంసమైన అరటి చెట్లు

నమ్ముకుని ఎండనక వాననక, మట్టి మనిషిగా మారి ఎన్నో ఆశలతో పంటలు సాగు చేస్తున్న రైతులపై ప్రకృతి వైపరీత్యాలు రైతులను వెంటాడంతో కష్టాల రైతు నష్టాలను చవిచూస్తున్నాడు. మర్పల్లి గ్రామానికి చెందిన రైతు రామోజి శ్రీవివాస్‌రెడ్డి తన మూడెకరాల పొలంలో 2 లక్షల పెట్టుబడితో అరటి సాగుచేశాడు.పంట చేతికొచ్చిన సమయానికి సోమవారమురాత్రీ బారి ఈదురు గాలులతో కురిసిన వర్షానికి అరటి చెట్లు విరిగి నేలకు వరగడంతో బారీ నష్టం వాటిల్లింది. పంట చేతికి వస్తే 5లక్షల వరకు ఆదాయం వచ్చేదనీ ఆకాల వర్షాల కారనంగా చేతికి వచ్చిన పంట నేలపాలు కావడంతో రెండుల పెట్టుబడితో పాటు సంవత్సరము పడిన శ్రమవృదాగా మారిందనీ రైతు తన ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ ఆకాల వర్షాలకుజొన్న పంటలు కూడ నేలకు వరిగి రైతులను నష్టాలకు గరిచేశాయనీ పంట నష్టపోయిన రైతులను అధికారులు గుర్థించి నష్టపరిహారం అందించాలనీ రైతులు కోరుతున్నారు.

# ప్రభుత్వ భూముల సంరక్షణపై ప్రత్యేక దృష్టి

## -కోర్టు కేసుల పురోగతిపై అడిషనల్ కలెక్టర్ సమీక్ష

**ఇబ్రహీంపట్నం, మే 19, ప్రభాతవార్త:** ఇబ్రహీం పట్నం రెవెన్యూ డివిజన్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న కోర్టు కేసులు, ప్రభుత్వ భూముల సంరక్షణ మరియు భూసేకరణ అంశాలపై అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) కె. చంద్రారెడ్డి సమీక్ష నిర్వహించారు. ఇబ్రహీంపట్నం ఆర్డీఓ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో డివిజన్‌కు చెందిన రెవెన్యూ అధికా రులు, తహసీల్దారులు పాల్గొన్నారు. సమావేశంలో సుప్రీంకోర్టు, హైకోర్టు, జిల్లా కోర్టులతో పాటు ఇతర న్యాయస్థానాల్లో కొనసాగుతున్న ప్రభుత్వ భూములు, భూసేకరణకు సంబంధించిన కేసుల పురోగతిని కోర్టుల వారీగా సమీక్షించారు. కేసుల వివరాలను సమగ్రంగా సేకరించి, సమయానికి కౌంటర్ అఫిడవిట్లు దాఖలు చేసి ప్రభుత్వ భూము లను రక్షించేందుకు చర్యలు తీసుకోవాలని తహసీ ల్దారులకు అడిషనల్ కలెక్టర్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ భూముల పరిరక్షణలో అధికారులు అప్రమత్తంగా వ్యవహరిం చాలని, న్యాయపరమైన వ్యవహారాల్లో నిరక్ష ్యం లేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో ఇబ్రహీం పట్నం ఆర్డీఓ అనంత రెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (ల్యాండ్ ప్రొటెక్షన్) శ్రీనివాస్ రెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (ల్యాండ్ అక్విజిషన్) జీఎన్‌వీ రాజు తదితరులు, డివిజన్ పరిధిలోని తహసీల్దారులు పాల్గొన్నారు.




అధికారులతో సమావేశం నిర్వహిస్తున్న అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి



మట్టి పాత్రల తయారీపై అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

# సృజనాత్మకతకు రెక్కలు

## సర్కార్ బడిలో సమ్మర్ క్యాంప్ సందడి

**తాండూరు టౌన్, మే 19, ప్రభాతవార్త :** వేసవి సెలవులంటే కేవలం ఆటపాటలే కాదు, సరి కొత్త విషయాలను నేర్చుకునే అద్భుతమైన అవ కాశం అని నిరూపిస్తున్నాయి వికారాబాద్ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు. విద్యాశాఖ ఆదేశాల మేరకు జిల్లావ్యాప్తంగా ఎంపిక చేసిన 21 పీఎం శ్రీ పాఠశాలల్లో మిగతా 2లో



# ప్రజల కలెక్టర్

## జాతీయ స్థాయిలో రంగారెడ్డి రథసారథికి అరుదైన గౌరవం
## దేశవ్యాప్తంగా 800 మంది కలెక్టర్ల పనితీరుపై సర్వే
## టాప్100 రేసులో నారాయణ రెడ్డి

**రంగారెడ్డి అర్బన్, మే19, ప్రభాతవార్త:** ఆఫీస్ గదులకే పరిమితం కాలేదు.. ఆర్తుల సమస్యల వైపు అడుగులు వేశారు. ఆర్డర్లు వేయడమే కా దు.. అధికారులను వెంటబెట్టుకుని ఫీల్డ్‌లోకి దూకారు. ఆయనే రంగారెడ్డి జిల్లా రథసారథి, కలెక్టర్ సి.నారాయణ రెడ్డి. సమర్థ పరిపాలనకు బ్రాండ్ అంబాసిడర్‌గా, ప్రజాసేవలో సరికొత్త శకానికి నాంది పలికిన ఆయనకు ఇప్పుడు దేశ స్థాయిలో అత్యున్నత గుర్తింపు దక్కింది. దేశవ్యాప్తంగా సుమారు 800 జిల్లాల కలెక్టర్ల పనితీరుపై ఓ మీడియా సంస్థ నిర్వహించిన ప్రతిష్టాత్మక వార్షిక మిగతా 2లో

# కెమికల్ ఫ్యాక్టరీలో అగ్ని ప్రమాదం

## రియాక్టర్ పేలుడుతో భారీ ఆస్తి నష్టం

**మేడ్చల్, మే 19, ప్రభాతవార్త :** మేడ్చల్ జిల్లా మేడ్చల్ పారిశ్రామికవాడలో మంగళవారం మధ్యాహ్నం చోటుచేసుకున్న భారీ అగ్ని ప్రమాదం తీవ్ర కలకలం రేపింది. ఇండస్ట్రియల్ ఏరియాలో ఉన్న ఓ ప్రముఖ కెమికల్ ఫ్యాక్టరీలో అకస్మాత్తుగా జరిగిన రియాక్టర్ పేలుడు కారణంగా క్షణాల్లోనే మంటలు చెలరేగి పరిశ్రమ మొత్తం అగ్నికీలల్లో చిక్కుకుంది. భారీ శబ్దంతో జరిగిన పేలుడు కారణంగా సమీప ప్రాంతాల ప్రజలు ఒక్కసారిగా భయాందోళనలకు గురయ్యారు. పేలుడు ధాటికి ఫ్యాక్టరీ ప్రాంగణం మొత్తం కంపించిపోయిందని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. పరిశ్రమలో భారీగా రసాయన పదార్థాలు నిల్వ ఉండటంతో మంటలు మరింత వేగంగా వ్యాపించాయి. కొద్ది నిమిషాల్లోనే ఫ్యాక్టరీ అంతటా అగ్ని జ్వాలలు ఎగిసిపడటంతో ఆ ప్రాంతమంతా రణరంగాన్ని తలపించింది. ఫ్యాక్టరీలోని మిగతా 2లో



# బూత్ లెవెల్ ఏజెంట్ల నియామకానికి చర్యలు



మాట్లాడుతున్న కలెక్టర్

**వికారాబాద్, ప్రభాతవార్త :** బూత్ లెవెల్ ఏజెంట్ల నియామకానికి తక్షణ చర్యలుతీసుకోవాలని జిల్లాకలెక్టర్ దీపక్ తివారీ అన్నారు.

మంగళవారం వీడియో కాన్ఫ రెన్సు హాలులో వివిధ రాజ కీయ పార్టీల ప్రతినిదులతో ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, బూత్ లెవెల్ ఏజెంట్ల నియామకానికి తక్షణ చర్యలు చేపట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు బీఎల్ఏ ల నియామకం జాబితాను మిగతా 2లో



మైలార్‌దేవ్‌పల్లి పిహెచ్‌సిని తనిఖీ నిర్వహిస్తున్న జిల్లా వైద్య అధికారి

# ప్రతి మంగళవారం మహిళా క్లినిక్

## క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు తప్పనిసరి- జిల్లా వైద్య అధికారి డాక్టర్ డి.స్వర్ణ కుమారి

**రంగారెడ్డి అర్బన్, మే19, ప్రభాతవార్త :** మైలార్‌దేవ్‌పల్లి పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ డి.స్వర్ణ కుమారి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో పనిచేస్తున్న సిబ్బంది వివరాలు,హాజరు పట్టిక, బెడ్ల పరిస్థితి, ఔషధాల గడువు తేదీలు, ఆసుపత్రి ఆవరణ పరిశుభ్రత తదితర అంశాలను ఆమె పరిశీలించారు. అలాగే గర్భిణీలకు సరైన వైద్య సేవలు అందుతున్నాయా అనే విషయాన్ని వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో అందుతున్న వివిధ వైద్య సేవలను సమగ్రంగా పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ ఆసుపత్రిలో డెలివరీల సంఖ్య పెరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి మంగళవారం ఆరోగ్య మహిళా క్లినిక్ నిర్వహించడంతో పాటు మహిళలకు క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేపట్టాలని తెలిపారు. రక్తహీనతతో బాధపడుతున్న మహిళలకు సరైన చికిత్స అందించాలని వైద్యులకు ఆదేశించారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు కనీస సౌకర్యాలు కల్పించాలని, ముఖ్యంగా వేచి ఉండే ప్రాంతాల్లో కూర్చునే ఏర్పాట్లు, త్రాగునీటి సదుపాయం వంటి సౌకర్యాలు అందుబాటులో ఉంచాలని సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాల మేరకు అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను సమర్థంగా అమలు చేయాలని తెలిపారు. వైద్యాధికారి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జికి తొలగని గ్రహణం

**ప్రభాతవార్త, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :** ప్రభుత్వశాఖల మధ్య సమన్వయలోపం వల్ల పలు అభివృద్ధి పనులు ముందుకు సాగడం లేదు. ఈ శాఖల మధ్య సమన్వయం కుదర్చాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉన్నా కొంతమంది అధికారుల పనితీరు వల్ల సాధ్యం కావడం లేదు. రెండు శాఖల మధ్య సమన్వయలోపం కారణంగా తాండూరు రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి పనులు నత్తనడకన సాగుతున్నాయి. తాండూరు పట్టణం నుంచి పాత తాండూరు వరకు రూ.90 కోట్ల వ్యయంతో రైల్వే వంతెన పనులు యేడాది క్రితం

## నష్టపరిహారంపై కొరవడిన స్పష్టత
## పాక్షికంగా 50 ఇళ్లకు నష్టం
## తాండూరు రెవెన్యూశాఖ నిర్లక్ష్యంతో సర్కారుకు అందని సర్వే నివేదికలు
## ముందుకు సాగని రూ.90 కోట్ల పనులు

ప్రారంభించారు. ఆరంభంలో రెండు పిల్లర్లు వేగంగా నిర్మించారు. అంత లోనే పట్టణానికి చెందిన ఓ పెద్దాయన ప్రైవేటు ఆస్తులకు నష్టం వాటిల్లుతుందని అభ్యంతరాలు వ్యక్తం చేశారు. కొద్ది రోజుల పాటు రోడ్లు భవనాలశాఖ, రెవెన్యూశాఖ అధికారుల మధ్య చర్చోపచర్చలు జరిగిన తర్వాత పనులు పునఃప్రారంభించారు. అయినా అనుకున్నంత పురోగతి సాధించడం లేదు.

పట్టణంలోని శాంత్‌మహల్ టాకీసు నుంచి, రైల్వేస్టేషన్ మార్గం, డీఎస్పీ ఆఫీసు, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పరిసరాల మీదుగా పాత తాండూరు వరకు రైల్వే ఫ్లైఓవర్ నిర్మించేందుకు నిధులు మంజూరు చేశారు. సుమారు కిలోమీటరు పొడవు నిర్మించే వంతెన కారణంగా 40 నుంచి 50 ఇళ్లలో కొన్ని పూర్తిగా, పలు ఇండ్లు పాక్షికంగా నష్టం వాటిల్ల వచ్చని అధికారులు అంచనా వేశారు. దెబ్బ తిన్న ఇళ్లకు నష్టపరిహారం చెల్లించే విషయంలో రెవెన్యూశాఖ సమగ్ర సర్వే చేపట్టి ప్రభుత్వానికి నివేదిక సమర్పించాలి. కానీ ఇప్పటి వరకు నివేదిక సమర్పించలేదని సమాచారం, దానివల్ల పనులకు అడ్డంకిగా మారాయి. ఇప్పటి వరకు రూ.3 కోట్ల విలువైన పనులు మాత్రమే పూర్తి చేశారు. ఇంకా ఇంకా రూ.87 కోట్ల విలువైన పనులు చేపట్టాల్సి ఉంది. అందులో కనీస 30 కోట్ల రూపాయల వరకు నిర్వాసితులుగా మారుతున్న వారికి పునరావాసం, నష్టపరిహారం కల్పించాల్సి ఉంటుంది. రెవెన్యూ అధికారులు ఇప్పటి వరకు అనుకున్నంత మేరకు నివేదికలు సమర్పించలేదని సమాచారం. దానివల్ల పనులకు అంతరాయం ఏర్పడుతోంది. ప్రస్తుతం రైల్వేశాఖ నుంచి క్లియరెన్స్ రావడం వల్ల పట్టాల మీదుగా వంతెన పనులను వేగమంతం చేయనున్నారు. రైల్వే పట్టాలకు ఇరువైపులా పిల్లర్ల నిర్మాణం కోసం తవ్వకాలు చేపడుతున్నారు. రెవెన్యూ అధికారులు చొరవ తీసుకుని బాధితులకు జరుగుతున్న నష్టం అంచనా, విలువలపై నివేదిక సమర్పించాలని స్థానికులు అంటున్నారు.

**కూల్చివేతలు ఎంతవరకూ అంటే..**

ఫ్లైఓవర్ నిర్మాణం కారణంగా ఈ మార్గంలో రోడ్డును 52 ఫీట్ల వెడల్పు చేపట్టనున్నారు. అయితే, శాంత్‌మహల్ టాకీసు నుంచి డీఎస్పీ ఆఫీసు వరకు 80 అడుగుల రోడ్డు ఉన్నందున అక్కడ పెద్దగా నష్టం వాటిల్లకపోవచ్చని భావిస్తున్నారు. డీఎస్పీ ఆఫీసు మూల మలుపు నుంచి పాత తాండూరు వరకు ఇరుకు రోడ్లు ఉన్నందున ఇరువైపులా భారీగా నష్టపోవచ్చని అంచనా. ఫ్లైఓవర్ కింద ఇరువైపులా సర్వీసు రోడ్లు నిర్మించనున్నారు. ఈ మార్గంలో దశాబ్దాల క్రితమే నిర్మాణాలు చేపట్టారు. అప్పట్లో సరైన ప్రణాళికలు అమలు చేయనందున చాలామంది ఆస్తులకు నష్టం వాటిల్లుతోంది. ఇక్కడ మున్సిపల్ అధికారులు కూడా రెవెన్యూ, ఆర్‌అండ్‌బీ శాఖలతో సమన్వయంగా వ్యవహరించాల్సి ఉన్నది. బాధితుల ఆస్తులకు సంబంధించిన డాక్యుమెంట్లను పరిశీలించి నష్టం అంచనాలపై రెవెన్యూ సర్వేయర్‌లకు తగిన సలహా, సూచనలు ఇవ్వాలని అంటున్నారు.

**అయోమయంలో 'శివసత్య'**

పనులు దక్కించుకున్న 'శివసత్య' నిర్మాణ సంస్థ పనులను నాణ్యతాయుతంగా, వేగమంతంగా నిర్మించేందుకు ముందుకు వచ్చింది. కానీ ప్రభుత్వశాఖల ఉదాసీనత వల్ల ఎటూ తేల్చుకోలేని పరిస్థితిలో కొట్టుమిట్టాడుతోంది. 2027 జూన్ మాసాంతం వరకు పాత తాండూరు రైల్వే ఫ్లైఓవర్ నిర్మించేందుకు గడువు ఉన్నది. స్థానిక ఎమ్మెల్యే బీ.మనోహర్‌రెడ్డి వంతెన నిర్మాణం కోసం చొరవ తీసుకుంటున్నా, ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం కుదుర్చేందుకు మరోసారి అడుగులు వేయాలని స్థానికులు సూచిస్తున్నారు. బాధితులకు తగినర విధంగా పరిహారం అందించడమే కాకుండా నిర్వాసితులకు పునరావాస చర్యలు చేపట్టాలని స్వపక్ష, విపక్ష నేతలు అంటున్నారు.





పిల్లర్ల దశలోనే ఆగిపోయిన పనులు, ఫ్లైఓవర్ నిర్మించనున్న ప్రదేశం



రైల్వేగేటు వద్ద తాజాగా మొదలైన పనులు

**మా లోపం లేదు : ఆర్‌అండ్‌బి డిఈఈ**

ఫ్లైఓవర్ నిర్మాణంలో ఆర్‌అండ్‌బి లోపం ఏమీ లేదని తాండూరు డీఈఈ శ్రవణ్‌కుమార్ అన్నారు. భూసేకరణ, పరిహారంపై రెవెన్యూశాఖ నివేదికలపైనే ఆధారపడ్డామని తెలిపారు. ఇప్పటి వరకు పలు పిల్లర్ల నిర్మాణం పూర్తి చేశామన్నారు. రైల్వేశాఖ పరిధిలో నిర్మాణానికి సంపూర్ణ సహకారం అందుతుందని ఆయన చెప్పారు.



స్థల పరిశీలన చేస్తున్న మున్సిపల్ చైర్మన్ పత్యనాయక్

## ఆమనగల్లులో మేకల సంతకు ఏర్పాట్లు

**ఆమనగల్లు, మే19, ప్రభాతవార్త:** ఆమనగల్లు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో మేకల సంత నిర్వహించేందుకు సోమవారం మున్సిపాలిటీ చైర్మన్ పత్యనాయక్ సోమవారం స్థల పరిశీలన చేశారు. బిజెపి ఫ్లోర్ లీడర్ మొక్తాల వెంకటయ్య, కౌన్సిలర్లు ఎనుముల రమేశ్, ఎర్రవోలు మహేశ్, కోఆప్షన్ సభ్యుడు ఖాదర్‌లతో కలిసి షాద్‌నగర్ రోడ్డు సమీపంలోని బస్టాండ్ వెనుక మండల పరిషత్ కార్యాలయం సంబంధించిన స్థలాన్ని పరిశీలించారు. ఆమనగల్లు పట్టణంలో మేకలు, గొర్రెలు, పశువుల సంత లేకపోవడంతో ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల మండలాల పశురైతులు అమ్మకాలు, కొనుగోలు కోసం సుదూర ప్రాంతాలపై ఆధారపడాల్సి వస్తోంది. దీనివలన సమస్యను ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో సంత ఏర్పాటుకు మున్సిపాలిటీ చొరవ చూపడంతో ప్రజలు, రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**పనులు నాణ్యతగా చేపట్టాలి....**

ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులు పారదర్శకంగా నాణ్యవంతంగా కొనసాగాలని మున్సిపాలిటీ చైర్మన్ పత్యనాయక్ అన్నారు. నాణ్యతలో ఎక్కడ రాజీ పడకుండా వాటిని ప్రజలకు సుధీర్ఘకాలంగా మన్నికగా ఉండేలా చూడాలని ఆయన కోరారు. పట్టణంలోని కళ్యాణ గార్డెన్స్ సమీపంలో జరగుతున్న అండర్ డ్రైనేజీ పనులను ఆయన కమిషనర్ రాఘవేందర్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. త్వరతగతిన కేటాయించిన కాలంలో పనులు పూర్తి చేసేలా కాంట్రాక్టర్లు చొరవ చూపాలని సూచించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు ఎనుముల రమేశ్, మొక్తాల వెంకటయ్య, ఎర్రవోలు మహేశ్, కోఆప్షన్‌మెంబర్ ఖాదర్, కాలనీవాసులు కరీమ్, రహీమ్, పూసలి సత్యం తదితరులు ఉన్నారు.

## ప్రతి ఒక్కరూ సమాజసేవకు నడుంబిగించాలి



పెద్దేముల్‌లో ఏర్పాటుచేసిన చలివేంద్రం

**పెద్దేముల్, మే 19, ప్రభాతవార్త:** వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతో ఉపయోగపడతాయని తహసీల్దార్ వెంకటేష్ ప్రసాద్ అన్నారు. మంగళవారం పెద్దేముల్ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో రుస్తుంఖాన్ జ్ఞాపకార్థం వారి కుమారులు యండి, ఆజంఖాన్ ఆయన సోదరుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని తహసీల్దార్ వెంకటేష్ ప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ వెంకటేష్ ప్రసాద్ మాట్లాడుతూ వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఉచిత చలివేంద్రం ఏర్పాటు చేయడం మానవత్వానికి నిజమైన నిదర్శనం అన్నారు. ప్రతి వ్యక్తి తన సంపాదనలో ఎంతో కొంత సమాజ సేవకు ఉపయోగపడేలా కార్యక్రమాలు చేపట్టాలని అన్నారు. ఉచిత చలివేంద్రం ఏర్పాటు చేసిన ఆజంఖాన్‌ను ఆదర్శంగా తీసుకొని మానవసేవ చేసేందుకు మరికొందరు దాతలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసులు, ఆర్ఐ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధుడు అదృశ్యం

**కుటుంబ సభ్యుల ఆందోళన**

**జవహర్ నగర్, మే 19, ప్రభాతవార్త:** జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని.ఫిర్యాదుదారుడు అమన్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం, తన తండ్రి మహేశ్వర్ దాస్ (72), తండ్రి పేరు.లేట్ రామ్‌ధారి దాస్, నివాసం లక్ష్మీ నగర్ కాలనీ, ఇంగ్లీష్ కాన్వెంట్ స్కూల్ సమీపం, బాలాజీనగర్‌లో కొన్ని రోజులుగా మతిస్థిమితం సరిగా లేక ఇంట్లోనే ఉంటున్నాడు. అప్పుడప్పుడు బయటకు వెళ్లి తిరిగి ఇంటికి వచ్చేవాడని తెలిపారు.తేదీ 17052026న సాయంత్రం సుమారు 4:00 గంటల సమయంలో సమీపంలోని షాపుకు



వెళ్తానని చెప్పి ఇంటి నుండి వెళ్లిన మహేశ్వర్ దాస్ తిరిగి ఇంటికి రాలేదని కుటుంబ సభ్యులు తెలిపారు.అతని వివరాలు ఇలా ఉన్నాయి ఎత్తు సుమారు 5.3 అడుగులు, గోధుమ వర్ణం, హిందీ భాష మాట్లాడగలడు. ఎడమ చేతిపై టాటూ గుర్తు ఉంది.ఫిర్యాదుదారుడు మరియు కుటుంబ సభ్యులు సమీప ప్రాంతాల్లో, బంధువుల వద్ద, తెలిసిన వ్యక్తుల వద్ద గాలించినప్పటికీ ఆయన ఆచూకీ లభించలేదు. దీంతో తగు చర్యలు తీసుకొని గల్లంతైన వ్యక్తిని గుర్తించి అప్పగించవలసిందిగా పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## తల్లి ఇంటికి వెళ్లి వచ్చేసారికి ఇల్లు గుల్ల

**-ఇంట్లోకి చొరబడి నగదు,బంగారు ఎత్తుకెళ్లిన దుండగులు**

**రంగారెడ్డి అర్బన్, మే 19, ప్రభాతవార్త:**

శంషాబాద్ మండలంలోని ఘన్సిమియాగూడ గ్రామంలో ఓ ఇంట్లో గుర్తు తెలియని దుండగులు చొరబడి నగదు,బంగారు చోరీకి పాల్పడిన ఘటన శంషాబాద్ రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది.ఇన్‌స్పెక్టర్ నరేందర్ రెడ్డి వివరాల ప్రకారం.. ఘన్సిమియాగూడలోని హనుమాన్ కాలనీలో నివాసం ఉంటున్న అద్దేపల్లి లక్ష్మీ ్మపావన్ కుమార్ (38) సోమవారం రాత్రి ఇంటికి తాళం వేసి అదే కాలనీలో మరో ఇంట్లో నివాసం ఉంటున్న తల్లి ఇంటికి వెళ్లాడు.మంగళవారం ఉదయం తిరిగి వచ్చి చూడగా గది తాళం పగులగొట్టి ఉండటం గమనించారు. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా తెరిచి ఉండటంతో పాటు బట్టలు చెల్లాచెదురుగా పడి ఉన్నాయి.బీరువాలో ఉన్న 7 గ్రాముల బంగారు ఉంగరం, మూడు వెండి నాణేలు, రెండు వెండి ఉంగరాలు, పాత నాణేలు మరియు రూ.15 వేల నగదు కనిపించకపోవడంతో చోరీ జరిగినట్లు గుర్తించారు.గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లోకి చొరబడి చోరీకి పాల్పడ్డారని ఫిర్యాదుదారుడు శంషాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేయగా ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

### బైకును ఢీకొన్న వ్యాను

## ముగ్గురు దుర్మరణం

**కడ్తాల్, మే 19, ప్రభాతవార్త:** రోడ్డు ప్రమాదంలో ముగ్గురు దుర్మరణం చెందగా మరో చిన్నారి తీవ్ర గాయాలైన సంఘటన హైదరా బాద్ శ్రీశైలం జాతీయ రహదారి రంగారెడ్డి జిల్లా కడ్తాల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సిఐ సైదిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా కేశంపేట మండలం తొమ్మిది రేకుల గ్రామానికి చెందిన ఇరుకల ప్రశాంత్ ( చింటు) (23) మైసిగండి ఇలా జరిగిన ఓ శుభకార్యంలో పాల్గొని కడ్తాల్ నుండి కందుకూరు వైపు ద్విచక్ర వాహనంపై ముగ్గురు చిన్నారులు, ఒక వ్యక్తి వెళ్తుండగా కొల్లాపూర్ నుండి మామిడికాయల లోడుతో వస్తున్న అశోక్ లేలాండ్ ఆటో వీరు ప్రయాణిస్తున్న బైక్‌ను వెనుకనుంచి బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో ప్రశాంత్ అక్కడికక్కడే దుర్మరణం చెందగా ముగ్గురు చిన్నారులు ఉదయ్ , కీర్తి, భాను తీవ్రంగా గాయపడ్డారు. చికిత్స నిమిత్తం హైదరాబాద్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ కీర్తి (8), భాను ( 7) లు చిన్నారులు మృతి చెందారు. మరో చిన్నారి తీవ్ర గాయాలతో చికిత్స పొందుతుంది. ఈ ఘటనపై కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు సిఐ సైదిరెడ్డి తెలిపారు.

## రావుల్‌పల్లిలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు

**కొడంగల్ రూరల్, మే 19 (ప్రభాతవార్త):** కొడంగల్ మండలంలోని రావుల్‌పల్లి గ్రామంలో మంగళవారం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం నిర్వహించారు. శాస్త్రవేత్తలు సత్యనారాయణ, పరమేశ్ రైతులకు పంటల సాగు విధానం గురించి అవగాహన కల్పించారు. రైతులు పంటల సాగులో యూరియా వాడాకాన్ని తగ్గించాని, సేంద్రీయ ఎరువులను వాడాలని సూచించారు. భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలని, నేల స్వభావం మేరకు పంటలు సాగు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పద్మమ్మ, వ్యవసాయ అధికారులు శ్రీలత, సుమ, గ్రామస్థులు, రైతులు పాల్గొన్నారు.

# ఆర్‌అండ్‌బి రోడ్ల అభివృద్ధికి పెద్ద పీట

**శామీర్‌పేట, మే 19, ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం ఆర్‌అండ్‌బి రోడ్ల అభివృద్ధికి పెద్ద పీట వేస్తోందని టిపిసిసి ప్రధాన కార్యదర్శి పీసరి మహిపాల్‌రెడ్డి పేర్కొన్నారు. మేడ్చల్ నియోజకవర్గంలో రోడ్ల అభివృద్ధికి ఆర్‌అండ్‌బి శాఖ ద్వారా 226.78కోట్ల రూపాయలు మంజూరు అయినట్లు వెల్లడించారు. శామీర్‌పేట మండల ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లా డుతూ.. దశల వారీగ అన్ని రోడ్లను బాగుచేయటానికి ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు.

శామీర్‌పేట డివిజన్‌లోని తూంకుంట నుంచి కొంపల్లి బ్రిడ్జి వరకు 9.03కోట్లతో సుమారు 7.8కిలోమీటర్ల దూరం పాటు రోడ్డు నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు మహిపాల్‌రెడ్డి తెలిపారు. దొంగల మైసమ్మ చౌరస్తా నుంచి యాద్గార్‌పల్లి ఓఆర్ఆర్ వరకు 9కిలో మీటర్ల దూరం వరకు, మేడ్చల్ నుంచి గుండ్లపోచంపల్లి వరకు, దుండిగల్ డివిజన్‌లో 47.51కోట్లతో మేడ్చల్ చెక్‌పోస్టు ఔటర్ రింగురోడ్డు దుండిగల్ ఓఆర్ఆర్ వరకు టూలైన్ టు 4ఫోర్త్ లైన్, అలియాబాద్, ఎల్లంపేట్ మున్సిపాల్టీ, కిష్టాపూర్ డివిజన్ నుంచి 47.51కోట్లతో శామీర్‌పేట మండలం మజీద్‌పూర్ చౌరస్తా నుంచి మేడ్చల్ చెక్‌పోస్టు వరకు 10 కిలోమీటర్లు 2లైన్‌టు4లైన్, కీసర డివిజన్, ఘట్‌కేసర్ డివిజన్ 15.75 కోట్లతో యాద్గార్‌పల్లి




మాట్లాడుతున్న టిపిసిసి ప్రధాన కార్యదర్శి పీసరి మహిపాల్‌రెడ్డి

ఓఆర్ఆర్ నుంచి ఘట్‌కేసర్ వరకు సుమారు 13 కిలోమీటర్ల దూరం, కీసర డివిజన్ నుంచి మూడు చింతలపల్లికి 17.66కోట్లతో కీసర నుంచి లక్ష్మాపూర్ రోడ్డు 15కిలో మీటర్లు, మేడ్చల్ డివిజన్ గుండ్ల పోచంపల్లి రూ.12కోట్లతో మేడ్చల్ చెక్‌పోస్టు ఓఆర్ఆర్ సుమారు 1.8కిలోమీటర్లు, అలియాబాద్ నుంచి మూడుచింతలపల్లి మున్సిపాల్టీల్లో రూ.59.52కోట్లతో తుర్క పల్లి జీనోమ్‌వ్యాలీ రోడ్డును 10.4కిలోమీటర్లు టూలైన్ టూ 4లైన్ వరకు పనులు చేపట్టటానికి నిధులు మంజూరు అయినట్లు త్వరలోనే పనులు ప్రారంభిస్తారని ఆయన తెలిపారు.

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రాష్ట్ర రోడ్లు,భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంక ట్‌రెడ్డి, జిల్లా ఇంచార్జి మంత్రి డి.శ్రీధర్‌బాబులకు ఈ సందర్భంగా టిపిసిసి ప్రధాన కార్యదర్శి పీసరి మహిపాల్‌రెడ్డి వారికి ధన్యవాదాలు తెలియజేశారు.

# పారదర్శకతతో ధాన్యం కొనుగోళ్లు

**ఆమనగల్లు, మే19, ప్రభాతవార్త :** వరి ధాన్యం కోనుగోలు కేంద్రాల వద్ద రైతులకు సమస్యలు తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ సివిల్ సప్లై డిఎస్‌పి రమేశ్‌రెడ్డి అన్నారు. కొనుగోలులో పారదర్శకతతో వ్యవహరించి టోకెన్ పద్ధతిని అవలంబిస్తూ సేకరించిన ధాన్యంను ఎప్పటికప్పుడూ తరలించాలని ఆయన పేర్కొన్నారు. ఆమనగల్లు పట్టణ కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డులో పిఎసిఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం డిఎస్ఎస్ఓ నవజాతతో కలిసి ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. కొనుగోలు కేంద్రానికి విచ్చేసిన ధాన్యాన్ని పరిశీలించి రైతులతో ముచ్చటించి పలు అంశాలను వివరించారు. ఈసందర్భంగా ఆయన నిర్వహకులతో సమావేశమయ్యారు. కొనుగోలు కేంద్రం వద్ద అవలంబించవలసిన పద్ధతులపై సూచనలు అందజేశారు. మిల్లులకు వేగవంతంగా ధాన్యం తరలించాలన్నారు. రైతులు నిరీక్షించకుండా టోకెన్ విధానాన్ని అమలు చేయాలని సూచించారు. ఈసందర్భంగా కూలీల సంఖ్య, అందుబాటులో ఉన్న గన్నీ బ్యాగులు, సేకరించిన ధాన్యం వివరాలు, రోజుకు వస్తున్న ధాన్యం



వరికొనుగోలు కేంద్రంలో పర్యటిస్తున్న ఎస్ఎస్ డీఎస్పీ రమేశ్‌రెడ్డి

తదితర అంశాలపై సమీక్షించారు. కార్యక్రమంలో పిఎసిఎస్ సీఈఓ పద్మాకర్‌రెడ్డి, సెక్రటరీ దేవేందర్, ఏఎంసీ వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్‌రెడ్డి, డైరెక్టర్లు తాళ్ళ రవిందర్, జెల్ల రమేశ్‌గౌడ్, సంపత్‌కుమార్, నరేశ్‌నాయక్, మెకానిక్‌బాబా, శ్రీనునాయక్ తదితరులు ఉన్నారు.

# యువతకు నైపుణ్యాభివృద్ధిపై అవగాహన




పాల్గొన్న యువజన శాఖ ఇన్‌చార్జి అధికారి ఐ.విజయకుమారి

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, మే 19, ప్రభాతవార్త :** తెలంగాణ ప్రభుత్వం ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక 99రోజుల కార్యక్రమంలో భాగంగ యువజన, క్రీడల, పర్యాటక శాఖల వారోత్సవాలను పురస్కరించుకుని యువతకు వివిధ కోర్సులపై అవగాహన కల్పించటం జరిగిందని మేడ్చల్ జిల్లా యువజన, క్రీడల, పర్యాటక శాఖల ఇన్‌చార్జి అధికారి ఐ.విజయకుమారి తెలిపారు. మంగళవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో యువజన, క్రీడల, పర్యాటక వారోత్సవంలో యువతకు స్కిల్ డవలప్‌మెంట్ కోర్సెస్, సెల్ఫ్ ఎంపాయిమెంట్ కోర్సెస్, స్పోర్ట్సు యూనివర్సిటీ కోర్సులతో పాటు పలు కోర్సులపై యువతకు సంబంధిత అధికారులు అవగాహన కల్పించారు. టూరిజం గురించి వారికి అవగాహణ కల్పించారు. జిల్లాలోని కీసరగుట్ట, హెరిటేజ్ టూరిస్ట్ స్పాట్ వాటి ప్రాముఖ్యతను వారికి సంబంధిత అధికారులు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ డిస్టిక్ట్ డవలప్‌మెంట్ అధికారి వినోద్‌కుమార్, డిఆర్‌డిఓ సాంబశివరావు, జిల్లా ఉపాధి కల్పన అధికారి రాధిక, పరిశ్రమల శాఖ జయంతి, మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లా ఐటిఐ కాలేజీ ట్రైనింగ్ ఆఫీసర్స్ సత్యనారాయణ, రవీందర్, పాలిపైల్వాన్‌లతో పాటు 130మంది విద్యార్థులు (యువత), సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# భూ బకాసురుల భరతం పడతాం

**టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు బక్కని నర్సింలు హెచ్చరిక**

**నందిగామ, మే 19, ప్రభాతవార్త :** ప్రకృతి సిద్ధమైన వనరులకు ఆటంకం కలిగిస్తే మానవ మనుగడ ప్రశ్నార్థకమవుతుందని షాద్నగర్ మాజీ ఎమ్మెల్యే, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు బక్కని నర్సింలు అన్నారు. మంగళవారం నందిగామ మండలం మొదల్లాగూడెంలోని సర్వేనెంబర్ 292 భూముల్లో ఆక్రమణకు గురైన నీటి పరివాహ ప్రదేశాలను పరిశీలించారు. సర్కారు భూములను చౌకగా తీసుకొని న క్షబాటులను,కాలువలను, కుంటలను ధ్వంసం చేస్తే రాబోయే రోజుల్లో భారీ వరద గురయ్యే ప్రమాదం ఉందన్నారు. గతంలో టిడిపి హయాంలో పాటు కాలువలు, చెక్ డ్యాములు నిర్మించిందని, జన్మభూమి, ప్రజల



మొదల్లగూడలో అక్రమ మట్టిని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింలు.

వద్దకు పాలన వంటి పథకాలను ప్రవేశపెట్టి ప్రజలకు లబ్ధి



పాటు కాలువకడంగా సిమెంట్ పలకలు వేసిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే

చేకూర్చిందన్నారు. ప్రకృతి సిద్ధంగా వచ్చే నీటి పరివాహక ప్రదేశంలో కళాశాలను నిర్మించి వరద నీటిని పక్కదారి మళ్లించిన వారిపై ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. కళాశాల నిర్మాణం పేరుతో ప్రభుత్వ భూముల్లోని మట్టిని తీసి వ్యాపారం చేయడం సిగ్గుచేటు అన్నారు. మొదల్లగూడలో వంతెన వద్ద వరద నీరు రాకుండా వేసిన సిమెంటు పలకలను తొలగించే లా చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ శాఖ ఇ ఇ చంద్ర ప్రకాష్ కు సూచించారు. టాటా సింబాసిస్ ఇచ్చిన 40 ఎకరాల ప్రభుత్వ భూమిని పేదలకు పంచాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మాజీ ఎమ్మెల్యే వెంట మామిడిపల్లి శ్రీకాంత్ రెడ్డి, గడ్డం జంగయ్య, చీకుర్తి సుదర్శన్, స్థానిక నాయకులు తదితరులు ఉన్నారు.

# ఆపదలో అండగా సిఎం సహాయనిధి




లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

**రంగారెడ్డి అర్బన్ మే 19. ప్రభాతవార్త:**
ఆపదలో ఉన్నవారికి సిఎం సహాయనిధి అండగా నిలుస్తుందని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పేర్కొన్నారు. శంషాబాద్ మండల పార్టీ సీనియర్ నాయకులు చంద్రారెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం దుర్గానగర్‌లోని ఎమ్మెల్యే నివాసంలో శంషాబాద్ మండలానికి చెందిన ఏడు మంది లబ్ధిదారులకు సుమారు 3 లక్షల రూపాయల చెక్కులను ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ..నిరుపేద కుటుంబాలకు సిఎం సహాయనిధి అనేది వరం లాంటిదని ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరూ సద్వి నియోగం చేసుకోవాలని సూచించారు. పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను ప్రభుత్వం అంద జేస్తుందని అన్నారు. అనంతరం లబ్ధిదారులు ఎమ్మెల్యే కి కృత జ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ ప్రధాన కార్యదర్శి చిలుకమర్రి మహేందర్ ముదిరాజ్ , సర్పంచులు ప్రభాకర్ గౌడ్ ,బాలు ముదిరాజ్ ,పి.నరసింహ, నార్సింగి మార్కెట్ డైరెక్టర్ శ్రీకాంత్ గౌడ్ ,ఉప సర్పంచ్ లు దండు శివ ,పి. శ్రీశైలం, మాజీ సర్పంచులు దండు ఇస్తారి ,సతీష్ యాదవ్, కర్రె నరసింహ, బిక్షపతి,జగన్ గౌడ్ ,వార్డు సభ్యులు మహేష్ ,రాజు గౌడ్, సిద్దిక్ ,శివ ,జర్కి రమేష్ మరియు వివిధ గ్రామాల పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## భార్య అదృశ్యం



**పోలీసులకు భర్త ఫిర్యాదు**

**జవహర్ నగర్, మే 19, ప్రభాతవార్త:** జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోనిబాలాజీ నగర్‌కు చెందిన ఫిర్యాదుదారుడు గుగులోత్ ఉపేందర్ నాయక్ ఆర్మీ డెంటల్ కాలేజ్ సమీపంలో రేడియం షాప్ నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆయన భార్య గుగులోత్ మోనిక (22) గృహిణి.తేదీ 18052026న ఉపేందర్ నాయక్ భోజనం నిమిత్తం ఇంటికి వెళ్లగా, తన భార్య మోనిక ఇంట్లో కనిపించకుండా పోయినట్లు గమనించాడు. అనంతరం సమీప ప్రాంతాల్లో మరియు బంధువుల ఇళ్ల వద్ద వెతికినా ఆమె ఆచూకీ లభించలేదు.ఆమె మొబైల్ ఫోన్‌కు పలుమార్లు కాల్ చేయగా స్విచ్ ఆఫ్‌లో ఉన్నట్లు తెలిసింది. అనంతరం పొరుగింటి సిసిటివి ఫుటేజ్ పరిశీలించగా, అదే రోజు ఉదయం సుమారు 11:30 గంటల సమయంలో మోనిక ఒక ఆటోలో వెళ్లినట్లు గుర్తించారు.అన్ని విధాలుగా గాలించినప్పటికీ ఆమె ఆచూకీ లభించకపోవడంతో, భర్త ఉపేందర్ నాయక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## అమీనా ప్రతిభకు తెలంగాణ రక్షణ సేన ఘన సత్కారం

**కేశంపేట, మే 19, ప్రభాతవార్త:** కేశంపేట మండల కేంద్రంలో జడ్పీహెచ్ఎస్



విద్యార్థిని అమీనాను సన్మానిస్తున్న తెలంగాణ రక్షణ సేన నాయకులు

ఉన్నత పాఠశాల విద్యార్థిని అమీనా ఇటీవల విడుదలైన పదో తరగతి ఫలితాల్లో 600 మార్కులకు గాను 581 మార్కులు సాధించి అద్భుత ప్రతిభ కనబరిచింది. మంగళవారం తెలంగాణ రక్షణ సేన ముస్లిం మైనార్టీ రాష్ట్ర నాయకులు ఎండి ముస్తఫా ఆధ్వర్యంలో అమీనకు శాలువా కప్పి సత్కరించారు అనంతరం ఆమె తల్లిదండ్రులను ఘనంగా సత్కరించారు. అమ్మి నాకు వారి తల్లిదండ్రులకు స్వీట్లు తినిపించి, బహుమతులు అందజేసి హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ముస్తఫా మాట్లాడుతూ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత చదువులు అభ్యసించి సమాజంలో మంచి గుర్తింపు పొంది పుట్టి పెరిగిన ఊరికి జన్మనిచ్చిన తల్లిదండ్రులకు మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షి ంచారు. పైచదువుల కోసం తమ వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని ఎండి ముస్తఫా భరోసా ఇచ్చారు. మహిళలు విద్యారంగాలలో ముందడుగు వేసి మృత శిఖరాలను అధిరోహించాలని చదువు ద్వారానే పేదరిక నిర్మూలనాన్ని పాలదొరొచ్చని అన్నింటికంటే శక్తివంతమైన ఆయుధం ఒక విద్యనేనని చిన్నప్పటినుండే కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరాలని సమాజంలో అప్పుడు మంచి గుర్తింపు లభిస్తుందని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ రక్షణ సేన విద్యార్థి విభాగం నాయకుడు మహేష్ కుమార్, నాయకులు నవీన్ కుమార్, బాలాజీ ఉదయ్, రవి, రాజు, పాండు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ఆధునిక సాగుతోనే అధిక దిగుబడి



"రైతు ముంగిట్లో వాస్తవేత్తలు" కార్యక్రమంలో అధికారులు, రైతులు.

**మోమిన్‌పేట్, మే 19. ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 99 రోజుల ప్రజాపాలన– ప్రగతిప్రణాళిక కార్యక్రమంలో బాగంగా "రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు" కార్యక్రమంలో బాగంగా మంగళవారం మోమిన్‌పేట్ మండల పరిధిలోని సయ్యదలీపూర్ గ్రామంలో వ్యవసాయశాఖ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్య క్రమంలో పాల్గొన్న శాస్త్రవేత్తలు పిజెటిఎస్ఏయు శాస్త్రవేత్తలు డాక్టర్ వాణీశ్రీ, మరియు డాక్టర్ పద్మజ లు మాట్లాడుతు ఆధునిక సాగుతోనే అధిక దిగుబడి అంటూ పంటల సాగు, ఎరువుల వినియోగం, పురుగుల మందుల నిర్వహణ, నేల ఆరోగ్య పరిరక్షణ తదితర అంశాలపై విలువైన సలహాలు, సూచనలు అందించారు.

అలాగే విచక్షణారహితంగా యూరియా వినియోగాన్ని తగ్గించాలని, మట్టి పరీక్షల ఆధారంగా మాత్రమే ఎరువులు వినియోగించాలని రైతులకు సూచించారు. సమతుల్య ఎరువుల వినియోగం, సమీకృత సస్యరక్షణ చర్యలు, ఆధునిక సాగు పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. అదేవిధంగా యూరియా కొనుగోలు ప్రక్రియను సులభతరం చేయడానికి రూపొందించిన ఫర్టిలైజర్ యాప్ గురించి కూడా రైతులకు అవగాహన కల్పించారు. ఈ యాప్ ద్వారా యూరియా లబ్యత ధరలు మరియు ఎరువుల దుకాణాల వివరాలను తెలుసుకోవచ్చని అధికారులు వివరించారు. రైతులు అడిగిన కొన్ని ప్రశ్నలకు వాస్త్రవేత్తలు, అధికారులు సమగ్ర సమాధానాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ప్రజాప్రతినితులు, నాయకులు జైపాల్, వెంకట్‌రెడ్డి, రైతులు, మండల పశు వైద్యాధికారి డాక్టర్ గీత, ఏఇఓ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి.. మరొకరికి గాయాలు..

**మొయినాబాద్, మే 19, ప్రభాతవార్త :** రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా.. మరొకరు గాయపడ్డారు. ఈ ఘటన మొయినాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. మొయినాబాద్ మండల పరిధిలోని కాశింబోలి గ్రామానికి చెందిన శివశాంత్ రెడ్డి వయస్సు (26) అతని స్నేహితుడు తరుణ్ రెడ్డి ఇద్దరు కలిసి సోమవారం రాత్రి తొమ్మిది గంటల సమయంలో టీఎస్07 జెఈ 1038 నంబర్ గల క్రెటా కారులో మొయినాబాద్ వెళ్లి తిరిగి ఖాసీంబౌలీ గ్రామానికి వస్తుండగా.. మార్గ మధ్యలోని జేబీఐటి కళాశాల వద్దకు చేరుకోగా.. వారి వాహనం అదుపుతప్పి జేబీఐటి కళాశాల ప్రహరీ గోడను ఢీకొట్టి, బోల్తా పడింది. ఈ ఘటనలో కారులో ఉన్న ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు వారిని చికిత్స నిమిత్తం నానాక్రంగుడాలోని అపోలో ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి 11 గంటల సమయంలో శివశాంత్ రెడ్డి మృతి చెందాడు. గాయపడిన తరుణ్ రెడ్డికి వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ఈ మేరకు

## ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

**మొయినాబాద్, మే 19, ప్రభాతవార్త :** చెట్టుకు ఉరి వేసుకుని ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మొయినాబాద్ మండల పరిధిలోని అమ్డపూర్ శివారులో జరిగింది. ఈ ఘటనపై పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వెస్ట్ బెంగాల్ కు చెందిన సమీర్ మాజీ వయస్సు (32) భార్య రాఖీ మాజీ కుటుంబ సభ్యులతో కలిసి బతుకుదెరువు నిమిత్తం వలస వచ్చారు. మొయినాబాద్ మండల పరిధిలోని అమ్డపూర్ శివారులోని ఓ ఫామ్హౌస్ లో పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. సోమవారం రాత్రి 8 గంటల సమయంలో సమీర్ మాజీ తన భార్యతో ఫామ్హౌస్ బయట గేటుకి తాళం వేసి వస్తానని చెప్పి వెళ్ళాడు. రాత్రి 10 అవుతున్న కూడా తన భర్త ఇంటికి రాకపోవడంతో ఆందోళన చెంది. తన భర్త కోసం చుట్టుపక్కల పరిసర ప్రాంతాల్లో చూడగా.. ఫామ్హౌస్ వెనకాలో ఉన్న వేప చెట్టుకు చీరతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటనపై మృతుడి భార్య రాఖీ మాజీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

## మరో యువకుడు ఆత్మహత్య

**షాబాద్ ,మే 19, ప్రభాతవార్త :**
షాబాద్ మండల పరిధిలోని పోతుగల్ గ్రామానికి చెందిన వేమనూరి మల్లికార్జున రెడ్డి వయస్సు (24) వృత్తి క్యాబ్ డ్రైవర్ గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని సురంగల్ గ్రామ శివారులోని కాశ్మీర్ ఫామ్హౌస్ సమీపంలో తాడుతో చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న మొయినాబాద్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. వేమనూరి మల్లికార్జున రెడ్డి మృతి పై కుటుంబ సభ్యులు అనుమానాలు వ్యక్తం చేశారు. మృతుడి తల్లి వేమనూరి సునంద ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.




ఎరువుల వినియోగంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

# యూరియా వినియోగం తగ్గించాలి

**శాస్త్రవేతల సూచనలు పాటించి అధిక దిగుబడి సాధించాలి**

**కుల్కచర్ల,మే,19 ప్రభాతవార్త :** భూసార పరీక్షల ఆధారంగానే అవసరమైనంత ఎరువులు వాడాలని,యూరియా వినియోగం తగ్గించాలి శాస్త్రవేతలు డాక్టర్ స్వర్ణలతదేవి సూచించారు. మంగళవారం మండల పరిధిలోని బండవెల్కిచర్ల గ్రామ పంచాయతీలో మండల వ్యవసాయ అధికారి వీరస్వామితో కలిసి రైతులకు సమతుల్య ఎరువుల వినియోగంపై అవగాహన కల్పించారు.ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం రాజేంద్రనగర్ వ్యవసాయ పరిశోధన ఆధ్వర్యంలో రైతు మంగిట్లో వ్యవసాయ శాస్త్రవేతలు అనే కార్యక్రమంలో రైతులకుఅవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...రసాయనిక ఎరువుల వాడకం వల్ల నేల, నీటి కాలుష్యం పెరగడంతో పాటు రైతుల పెట్టుబడి ఖర్చు వృథా అవుతుందన్నారు.సేంద్రియ, జివన ఎరువులను వినియోగించాలన్నారు.తద్వారా పంట పెట్టుబడి తగ్గి, దిగుబడి పెరుగుతుందన్నారు.యూరియాకు ప్రత్యామ్నాయంగా నానో యూరియా, నానో డిఏపి వంటివి వాడాలని సూచించారు.ఈ కార్యక్రమంలో డిసిసి జిల్లా ఉపాధ్యక్షులు భీంరెడ్డి, సర్పంచ్ మడుగు శ్రీనివాస్మార్కెట్ కమిటి ఛైర్మన్ ఆంజనేయులు ముదిరాజ్,పాంబండ ఆలయ మాజి ఛైర్మన్ కోట్ల హహిపాల్రెడ్డి, కాంగ్రెస్ పార్టీఆ మండల అధ్యక్షులు గోపాల్ నాయక్,ఎంపిడిఓ రామకృష్ణ నాయక్, ఎఈఓ బాబు, రైతులు పాల్గొన్నారు.

# జేర్పుల రాజు నాయక్ ముందస్తు అరెస్ట్

**కేశంపేట, మే 19, ప్రభాతవార్త :**

లంబాడి హక్కుల పోరాట సమితి కేశంపేట మండల అధ్యక్షుడు జేర్పుల రాజు నాయక్ ను మంగళవారం ఉదయం ఆయన నివాసం వద్ద ముందస్తు అరెస్ట్ చేశారు.సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ జ్ఞాన మందిర నిర్మాణానికి రూ. 1000 కోట్ల నిధులు కేటాయించాలని, ఆయన విగ్రహాన్ని హెచ్ఎండిఎ పరిధిలో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్లోని ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి ఇంటి ముట్టడి కార్యక్రమానికి బయలుదేరుతున్నరన్న సమాచారంతో పోలీసులు రాజు నాయక్తో పాటు మండల ఉపాధ్యక్షులు వీరేందర్ను కూడా అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్కు తరలించారు . హక్కుల కోసం పోరాడుతున్న నాయకులను ఉదయాన్నే ఇళ్ల వద్ద అరెస్ట్ చేయడం బంజారా సమాజానికి తీవ్ర అవమానకరమని, అక్రమంగా అరెస్ట్ చేసి ఉద్య మాన్ని ఆపలేరని న్యాయబద్ధమైన హక్కులను సాధించుకునేందుకు ఉద్యమిస్తూనే ఉంటామని అరెస్టులతో మా హక్కులను ఎవరు ఆపలేరని ఆయన అన్నారు.అరెస్ట్ చేసిన వారిని బేషరతుగా వెంటనే విడుదల చేయాలని ఎల్ హెచ్ పి ఎస్ శ్రేణులు డిమాండ్ చేస్తున్నాయి.



జేర్పుల రాజు నాయక్ ను ముందస్తు అరెస్టు

# మైసిగండి మైసమ్మ ఆలయ ఈవోగా వీరేశం

**కడ్తాల్, మే 19, ప్రభాతవార్త :** కడ్తాల్ మండలం మైసిగండి మైసమ్మ దేవత శివాలయ రామాలయ దేవస్థానం ఈవోగా వీరేశం మంగళవారం ఆదనపు బాధ్యతలు చేపట్టారు. నూతనంగా వచ్చిన ఆలయ ఈవో కు దేవస్థాన ఉద్యోగులు సిబ్బంది శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# తహసిల్దార్ను సన్మానించిన సర్పంచ్



తహసీల్దార్ను సన్మానిస్తున్న సర్పంచ్ ప్రభాకర్ గౌడ్,నాయకులు

**రంగారెడ్డి అర్బన్ మే 19,ప్రభాతవార్త :** రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం నూతన తహసిల్దార్ గా బాధ్యతలు స్వీకరించిన అమర్ లింగం గౌడ్ను మంగళవారం శంషాబాద్ తహసిల్దార్ కార్యాలయంలో సుల్తాన్ పల్లి గ్రామ సర్పంచ్ ఎలుగని ప్రభాకర్ గౌడ్ గ్రామానికి చెందిన నాయకులతో కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు.గ్రామంలో రైతులకు భూ సమస్యలు ఏమైనా ఉంటే తన దృష్టికి తీసుకురావాలని, పరిశీలించి న్యాయబద్ధంగా ఉంటే పరిష్కరించడానికి కృషి చేస్తానని సర్పంచ్ ప్రభాకర్ గౌడ్ కు తహసిల్దార్ సూచించారు. సుల్తాన్ పల్లి గ్రామంలో ఏమైనా భూ సమస్యలు, రైతులకు సంబంధించిన సమస్యలు ఉంటే తప్పకుండా మీ దృష్టికి తీసుకు వస్తామని సర్పంచ్ తహసిల్దార్ అమర్ లింగం గౌడ్ కు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ దండు శివ కుమార్, వార్డ్ సభ్యులు రాజు గౌడ్,నాయకులు శివ కుమార్ గౌడ్ , సిద్దిక్ తదిరులు పాల్గొన్నారు.

## అకాల మరణం పొందిన విద్యార్థి కుటుంబానికి ఉపాధ్యాయుడి బాసట

**-రూ.15 వేల ఆర్థిక సహాయం అందించి మానవత్వాన్ని చాటుకున్న జలంధర్రెడ్డి**



విద్యార్థి కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందజేస్తున్న ఉపాధ్యాయుడు

**దౌల్తాబాద్,మే 19,ప్రభాతవార్త:**

వికారాబాద్ జిల్లా దౌల్తాబాద్ మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గత సంవత్సరం 10వ తరగతి పూర్తి చేసుకున్న గుండాల గ్రామానికి చెందిన విద్యార్థి మాలే నర్సింలు ఇటీవల తీవ్ర అనారోగ్యానికి గురై అకాల మరణం చెందగా,ఆ పేద కుటుంబానికి అదే పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయుడు జలంధర్రెడ్డి కొండంత అండగా నిలిచారు.ఈ చేదు వార్త తెలుసుకున్న ఆయన మానవతా దృక్పథంతో మృతుని స్వగ్రామానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి,తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.ఆ కుటుంబానికి ధైర్యం చెబుతూ తనవంతు సహాయంగా రూ.15,000(పదిహేను వేల రూపాయలు) ఆర్థిక సహాయాన్ని అందజేసి తన ఉదారత్వాన్ని,మానవత్వాన్ని చాటుకున్నారు.కష్టకాలంలో తమను పరామర్శించి, ఆర్థికంగా ఆదుకోవడానికి వచ్చిన ఉపాధ్యాయుడిని చూసి మృతుని కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరవగా,అనంతరం ఆయనకు చేతులు జోడించి కృతజ్ఞతలు తెలియజేశారు.ఉపాధ్యాయుడు జలంధర్రెడ్డి చేసిన ఈ మంచి పనిని తోటి ఉపాధ్యాయ బృందం,గ్రామస్తులు ఎంతగానో అభినందించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు సాయిలు,అక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్కు కొత్త కళ రావాలి

**షాద్నగర్, మే 19, ప్రభాతవార్త :** షాద్ నగర్ నియోజకవర్గ మున్సిపాలిటీ, మండల అధ్యక్షులుగా ఎన్నికైన నాయకులను మార్కెట్ కమిటీ డైరెక్టర్ కరుణాకర్ ఘనంగా సన్మానించారు. కొత్త అధ్యక్షులతో షాద్ నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎంత ఎదగాలని ఆకాంక్షి స్తున్నట్లు వెల్లడించారు. షాద్నగర్ మున్సిపాలిటీ మండల అధ్యక్షుడు నలమోని శ్రీధర్, కొత్తూరు మున్సిపాలిటీ అధ్యక్షుడు సుదర్శన్ సుదర్శన్ గౌడ్, ఫరూక్ నగర్ మండల అధ్యక్షుడు రాయికల్ శ్రీనివాస్, కొందుర్గు మండల అధ్యక్షుడు పురుషోత్తం రెడ్డి, చౌదరిగుడా మండల అధ్యక్షుడు చంద్రశేఖర్, కొత్తూరు మండల అధ్యక్షుడు శేఖర్ రెడ్డి, నందిగామ మండల అధ్యక్షుడు కుమారస్వామి, కేశంపేట మండల అధ్యక్షుడు రమేష్ లను ఆయన సత్కరించారు. అధ్యక్షులుగా ఎన్నికైన వారందరికీ అభినందనలు తెలిపారు.



నూతన అధ్యక్షులతో కాంగ్రెస్ నాయకులు

# ధాన్యం కొనుగోళ్లు పారదర్శకంగా నిర్వహించాలి

**-రైతులకు సమగ్ర సేవలు అందాలి: కలెక్టర్**

**ఘట్కేసర్, మే 19, ప్రభాతవార్త:** రైతులకు ఏలాంటి ఇబ్బందులు కల్గకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియను సజావుగా నిర్వహించాలని మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్ మనుచౌదరి అధికారులను ఆదేశించారు. ఘట్కేసర్ సర్కిల్ ఎదులాబాద్ డివిజన్ పరిధిలోని మాధారం, ఎదులాబాద్ వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం కలెక్టర్ అకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్రెడ్డితో కలిసి ఆయన ధాన్యం సేకరణ కేంద్రాలను పరిశీలించి నిర్వహణపై ఆరా తీశారు. ధాన్యం సేకరణ కేంద్రానికి ఇప్పటి వరకు ఎన్ని లారీలు పంపించారని ఇంకా ఎంత ధాన్యం ఉందని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ధాన్యంలోని తేమ శాతాన్ని అదేవిధంగా శుభ్రతను పరిశీలించి వివరాలు సేకరించారు. రైతులకు ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రైతులు టార్పలిన్ సుత్తిలి బ్యాగులు అవసరమైనంత లేవని అదేవిధంగా రవాణాలలో ఆలస్యం జరుగుతుందని తెలియజేశారు. రైతులకు అవసరమైన టార్పాలిన్ సుత్తిలి బ్యాగులు వెంటనే తెప్పించి రైతులకు అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాలోని 15 కేంద్రాలకు గాను 15 ప్యాడీ క్లీనర్ మిషన్లు అందించాలని అందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని పౌరసరఫరాల అధికారులకు సూచించారు. ధాన్యాన్ని వెంటనే కొనుగోలు కేంద్రాలకు పంపించాలని అందుకు అవసరమైన లారీల రవాణాలో ఏలాంటి ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. ధాన్యం తూకం, నిల్వ, రవాణా ప్రక్రియలో ఏలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని, రైతులకు అన్ని సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఈకార్యక్రమంలో పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ సుగుణబాయి, డిసిఎస్ఓ శ్రీనివాస్రెడ్డి, డిసిఓ నాగలింగాచారి, జిల్లా వ్యవసాయాధికారిణి చంద్రకళ, ఘట్కేసర్ తహశీల్దార్ భీమర్తి చంద్రశేఖర్, వ్యవసాయాధికారిణి లావణ్య, గిర్దావర్ కావ్య, సహకార సంఘం ఎండి రాహుల్రాజ్, ఏఈఓ జగదీశ్వర్, మాజీ సర్పంచ్ నల్లోళ్ల యాదగిరి, సొసైటీ డైరక్టర్ కొమిరెడ్డి ఉదయ్కుమార్రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



వడ్లను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ మనుచౌదరి

# రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోళ్లు జరగాలి

**మాడ్గుల,మే19,ప్రభాతవార్త:** రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోళ్లు నిర్వహించాలని డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ నారాయణ రెడ్డి అన్నారు.మంగళవారం ఇబ్రహీంపట్నం డివిజన్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ రాజు కలిసి మండల పరిధిలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో ఏర్పాటు చేసిన వడ్ల కొనుగోలు కేంద్రాన్ని అయన సందర్శించి రైతుల కోసం కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు.ఈ సందర్భంగా సంబంధిత సంఘాల అధికారులతో మాట్లాడిన డిసిపి రైతులకు తాగునీరు,కూర్చునే ఏర్పాట్లు,నీడ,పారిశుద్ధ్య సదుపాయాలు,పరిశుభ్రత,టోకెన్ పంపిణీ,ధాన్యం తూకం వంటి అంశాలను సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. రైతులు ఇబ్బందులు పడకుండా క్యాలెన్లను క్రమబద్ధంగా నిర్వహించాలని సూచించారు.ధాన్యం కొనుగోలు ప్రక్రియలో పారదర్శకత పాటించాలని,రైతుల ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని తెలిపారు.కొనుగోలు కేంద్రాల వద్ద శాంతి భద్రతలు కాపాడడంతో పాటు మధ్యవర్తుల అక్రమ జోక్యాన్ని అరికట్టాలని అధికారులను ఆదేశించారు.ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా స్థానిక పోలీసులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు.కొనుగోలు కార్యక్రమాలకు సంబంధించిన రికార్డులను సక్రమంగా నిర్వహించి కేంద్రాలు సజావుగా పనిచేసేలా చూడాలని పేర్కొన్నారు.

అనంతరం డిసిపి మాడ్గుల పోలీస్ స్టేషన్ను సందర్శించి స్టేషన్ రికార్డులు,రిజిస్టర్లు,పెండింగ్ పిటిషన్లు,స్టేషన్ ఆస్తులు,బీట్ బుక్స్,క్రైమ్ రికార్డులు,రౌడీ షీట్లు,హిస్టరీ షీట్లు తదితర అంశాలను పరిశీలించారు.సీసీటీవీ కెమెరాల పనితీరు,వైర్లెస్ కమ్యూనికేషన్ పరికరాలు,స్టేషన్ పరిశుభ్రత,సిబ్బంది క్రమశిక్షణను తనిఖీ చేశారు.ఈ సందర్భంగా అధికారులు,సిబ్బంది ప్రజలకు స్నేహపూర్వకంగా వ్యవహరిస్తూ విధులను అంకితభావంతో,నిజాయితీతో నిర్వహించాలని డీసీపీ సూచించారు

రౌడీ షీటర్లు హిస్టరీ అనుమానాస్పద వ్యక్తులపై నిరంతరం నిఘా ఉంచి నేరాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

రాత్రి పహారా, వాహన తనిఖీలు,బీట్ పోలీసింగ్ను మరింత బలోపేతం చేసి ప్రజల ఫిర్యాదులకు తక్షణ స్పందన ఇవ్వాలని సూచించారు.గ్రామ పెద్దలు,ప్రజా ప్రతినిధులతో సమన్వయం పెంచుకొని కమ్యూనిటీ పోలీసింగ్ను సమర్థవంతంగా అమలు చేయాలని డీసీపీ పేర్కొన్నారు.చివరగా మాడ్గుల పోలీస్ స్టేషన్ సిబ్బంది పనితీరును అభినందిస్తూ ప్రజా సేవలో నిబద్ధతతో విధులు నిర్వహించాలని సూచించారు.



డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ నారాయణ రెడ్డి

# పేదల పెన్నిధి కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య



**ఆయన జీవితం స్ఫూర్తిదాయకం సిపిఎం నాయకులు**

**కందుకూరు, మే 19, (ప్రభాతవార్త):**

పేదల పెన్నిధి నిరాడంబరుడు పుచ్చలపల్లి సుందరయ్య 141 వ వర్ధంతి వేడుకలను సిపిఎం ఆధ్వర్యంలో కందుకూరు మండలంలో ఘనంగా జరుపుకున్నారు. సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కందుకూరు మండల సిపిఎం మండల కార్యదర్శి బుట్టి బాలరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పార్టీ జిల్లా సెక్రెటేరియట్ సభ్యులు దుబ్బాక రామచందర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. భారతదేశంలో కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత నిరాడంబరల జీవి కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య సమాజానికి మార్గదర్శిగా నిలిచారన్నారు. ఆయన ఆశయాల సాధనకు నేటి సమాజం ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. నెల్లూరుజిల్లాలో జమీందారీ కుటుంబంలో జన్మించిన కామ్రేడ్ సుందరయ్య తమకు ఉన్న ఆస్తి 600 ఎకరాల భూమిని పేదలకు పంపిణీ చేసి సమాజం పట్ల తనకున్న ప్రేమను ఆప్యాయతను ఉదాసీనత చాటుకున్నారన్నారు. పెద్దల అంగీకారం మేరకు వివాహం చేసుకున్న తమకు సమాజమే కుటుంబం అని భావించిన పుచ్చలపల్లి సుందరయ్య సంతానం కలగకుండా ఫ్యామిలీ ప్లానింగ్ చేసుకున్నారని జనమే తన పిల్లలుగా భావించి తన జీవితాన్ని కొనసాగించారన్నారు. ఆనాటి భారత ప్రధాని నెహ్రూ ఉండగా ప్రతిపక్ష నేతగా పుచ్చలపల్లి సుందరయ్య కొనసాగారని ఆయన ప్రతిపక్ష నేతగా ఉన్న ప్రభుత్వ సౌకర్యాలను తీసుకోకుండా సైకిల్ పైన పార్లమెంటుకు వెళ్లేవారు అని ప్రభుత్వం ఈ విషయంలో ఎంత విన్నవించినా త్రుణప్రాయంగా తిరస్కరించారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సుందరయ్య ఆశయాల స్ఫూర్తిగా సిపిఎం ముందుకు సాగుతుందని రెండు రోజులుగా వివో ఏ లు తమ డిమాండ్ల సాధనకు చేస్తున్న నిరసన కార్యక్రమాలకు సిపిఎం మద్దతుగా ఉంటుందని తెలియజేశారు. గతంలో కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్షంలో ఉన్న సమయంలో వివో ఏ లకు మద్దతుగా ఉండి వారి సమస్యల పరిష్కారం కొరకు పోరాటం చేసిందని నేడు అధికారంలోకి వచ్చిన వాటిని విస్మరించిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం వివో ఏ ల సమస్యల పరిష్కారం చేయాలని ఉద్యోగులుగా గుర్తించాలని 26 వేల రూపాయలను వేతనంగా ఇవ్వాలని పిఎఫ్ సౌకర్యాన్ని కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, ఏ కుమార్, రాములు, వివో ఏ ల సంఘం సీనియర్ నాయకులు శారద, రామచంద్రారెడ్డి, బాలమణి, కల్పన, అనిత, భాగ్యలక్ష్మి ్మ, సునీత తదితరులు పాల్గొన్నారు.

## పుచ్చలపల్లి సుందరయ్యకు ఘననివాళులు



పుచ్చలపల్లి సుందరయ్యకు నివాళ్ళు అర్పిస్తున్న సిపిఎం నాయకులు

**దుద్యాల్, మే 19, ప్రభాతవార్త:** స్వాతంత్ర సమరయోధుడు, తెలంగాణ పోరాటయోధుడు కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత పుచ్చల పల్లి సుందరయ్య వర్ధంతి సందర్భంగా ఆయనకు సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో నివాళులు అర్పించారు. సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు బుస్స చంద్రయ్య మాట్లాడుతూ, సుందరయ్య పేదల అభ్యున్నతి కోసం పాటుపడ్డారని, కుల వ్యవస్థను వ్యతిరేకించిన గొప్ప వ్యక్తి అన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో ముఖ్య పాత్ర పోషించారని, "కమ్యూనిస్టు గాంధీ" గా గుర్తింపు పొందారని కొనియాడారు. కార్యక్రమంలో కావలి సురేష్, వెంకటయ్య, సాయిలు, రాములు, మల్లప్ప, శంకర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## సుందరయ్య జీవితం అందరికి ఆదర్శం



నివాళులు అర్పిస్తున్న సిపిఎం నాయకులు

**పెద్దేముల్, మే 19, ప్రభాతవార్త:** సుందరయ్య జీవితం అందరికి ఆదర్శమని సిపిఎం జిల్లా కమిటి సభ్యులు కే.శ్రీనివాస్ అన్నారు. మంగళవారం సుందరయ్య వర్ధంతిని పురస్కరిచుకొని తాండూరు పట్టణంలోని అంబెద్కర్ విగ్రహం ముందు ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటి సభ్యులు కె.శ్రీనివాస్, యు.బుగ్గప్ప, తెలంగాణ జానసమితి జిల్లా నాయకులు సోమశేఖర్, పిడిఎస్యు జిల్లా నాయకులు శ్రీనివాస్లు మాట్లాడుతూ సుందరయ్యను నాటి సమాజం గుర్తించింది కాని ఇప్పుడు గుర్తించడంలేదని అన్నారు. సుందరయ్య మాదిరిగానే సమాజ సేవ కోసం బిడ్డలు లేకుండా చేసుకున్న వాళ్ళు కూడా ఉన్నారని అన్నారు. సుందరయ్య మద్రాస్లో మరణిస్తే దారిపొడవున ఆయనకు నివాళులు అర్పించేందుకు లక్షలాది జనం కదిలారని అన్నారు. అదంతా సుందరయ్య త్యాగాలకు, ఆయన కృషికి జనస్పందన అని అన్నారు. సుందరయ్య చూపిన మార్గంలో అతను కలలుగన్న ప్రతి వ్యక్తికి కూడు, గుడ్డ, నీడ కోసం కృషిచేయవలసిన అవసరం ఉందని, వాటి సాధన కోసం ప్రజలందరు సమిష్టిగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఆదర్శ నాయకులు కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య

**మొయినాబాద్,మే 19, (ప్రభాతవార్త):**

సిఐటియు మొయినాబాద్ మండల కమిటీ ఆధ్వర్యంలో దక్షి ణ భారతదేశ కమ్యూనిస్టు ఉద్యమ నాయకులు, రాజ్యసభ మొట్టమొదటి ప్రతిపక్ష నేత కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య గారి 41వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఇవాళ అర్పించడం జరిగింది ఈ సందర్భంగా సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ మాట్లాడుతూ పుచ్చలపల్లి సుందరయ్య దేశం గర్వించదగ్గ ప్రజా నాయకుడని మొట్టమొదటి రాజ్యసభ ప్రతిపక్ష నేతగా ఉన్న సమయంలో సైకిల్ పై పార్లమెంటుకు వెళ్లి నిరాడంబర జీవితాన్ని గడిపారని అన్నారు. ఉద్యమమే ఊపిరిగా ఆశయాలే గీటురాయిగా బ్రతికిన ఆదర్శ నాయకుడు పేద ప్రజలకు సేవ చేయడం కోసం పిల్లలను కూడా కనకుండా పేదలకే తన జీవితాన్ని అంకితం చేసి తనకున్నటువంటి వందల ఎకరాల భూములను పేద ప్రజలకు పంచిపెట్టారని అన్నారు నేటి సమాజానికి పుచ్చలపల్లి సుందరయ్య ఆదర్శనీయం, ఆయన ఆశయాల కోసం సిపిఎం సిఐటియు కృషి చేస్తుందని ఆయనను ఆదర్శంగా తీసుకొని కార్మికులు కర్షకుల సమస్యలపై అనేక పోరాటాలు నిర్వహిస్తున్నామని అన్నారు ఈ కార్యక్రమంలో సిఐటియు మొయినాబాద్ మండల కన్వీనర్ సిహెచ్ ప్రవీణ్ కుమార్ భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షులు ముంజగల ప్రభుదాస్ మున్సిపల్ యూనియన్ గౌరవ అధ్యక్షులు రత్నం మున్సిపల్ యూనియన్ అధ్యక్షులు సుధాకర్ వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు



## పుచ్చలపల్లి స్ఫూర్తితో ఉద్యమించాలి

**షాద్నగర్, మే 19, ప్రభాతవార్త :** దక్షి ణ



పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య అని సిపిఎం పార్టీ షాద్నగర్ పట్టణ కార్యదర్శి శ్రీను నాయక్ అన్నారు. మంగళవారం నాడు సుందరయ్య 41 వ వర్ధంతి సభ పట్టణంలోని సిపిఎం పార్టీ కార్యాలయంలో జరిగింది సందర్భంగా ఆయన ఫోటోకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా శ్రీను నాయక్ మాట్లాడుతూ సుందరయ్య లాంటి నిస్వార్థ నాయకులు నేటి రాజకీయాలలో లేరని, అలాంటి నాయకులు కావాలని, నిజాయితీ రాజకీయాలు చేయాలని, కార్పొరేట్, వ్యాపార రాజకీయాలు పోవాలని, కుటుంబం కంటే కూడా ప్రజలు వారి సమస్యలు పై పోరాటం చేసిన వ్యక్తి కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య అని ఆయన స్ఫూర్తితో సమస్త సమాజం కోసం ఉద్యమిస్తామని అన్నారు. సామాజిక అసమానతలు రూపుమాపాలని అవి వర్గ పోరాటం ద్వారానే సధ్యమని నమ్మిన సిద్ధాంతం కోసం నిస్వార్థంగా ఉన్నతమైన విలువలతో జీవించిన గొప్ప వ్యక్తి అని అన్నారు. భారతదేశంలో మొట్టమొదటిసారి వ్యవసాయ కార్మిక సంఘాన్ని స్థాపించి సంఘం ద్వారా కూలీల పోరాటాలు, భూమి పోరాటాలు నడిపిన, భూస్వామ్య వ్యతిరేక పోరాటాలు ఉద్యమాలు నడిపారన్నారు. స్వాతంత్ర పోరాటంలో మరియు తెలంగాణ రైతాంగ సైదా పోరాటానికి నాయకత్వం వహించి భూమికోసం భుక్తి కోసం పేద ప్రజల విముక్తి కోసం అలుపెరగని పోరాటాన్ని చేసిన యోధులు కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య అని కొనియాడారు. పార్లమెంటుకు సైకిల్ పై వెళ్లిన గొప్ప నేత సుందరయ్య అని అన్నారు. రానున్న కాలంలో కామ్రేడ్ సుందరయ్య స్ఫూర్తితో ఈ ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై సమరసిల్ల పోరాటాలు నిర్వహిస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో సిపిఎం పార్టీ నాయకులు ఈశ్వర్ నాయక్ శ్రీకాంత్ లక్ష్మ్మి మహమ్మద్ బాబు నిరంజన్ గౌడ్ కే పార్వతమ్మ అంగోత్ లక్ష్మ్మి అంజమ్మ ప్రజా సంఘాల నాయకులు వెంకటరమణ నర్సింలు గౌడ్ బాలయ్య వెంకటయ్య రాములు ఏటూరి కుర్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# సుందరయ్య జీవితం ఆదర్శనీయం

**ఘట్కేసర్, మే 19, ప్రభాతవార్త:** తెలంగాణలో భూస్వామ్య జమీందారీ రజాకార్లకు వ్యతిరేకంగా తెలంగాణ సాయుధ పోరాటం సాగించడంలో సుందరయ్య కీలకపాత్ర వహించారని సిపిఎం మండల కార్యదర్శి ఎన్.సబిత, సీనియర్ నాయకులు చింతల యాదయ్యలు పేర్కొన్నారు. ఘట్కేసర్లోని సీపీఎం కార్యాలయంలో మంగళవారం కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత పుచ్చలపల్లి సుందరయ్య 41వ వర్ధంతిని నిర్వహించారు. ఈసందర్భంగా సీపీఎం నాయకులు సుందరయ్య చిత్రపటానికి పూలమాళ వేసి నివాళులు అర్పించారు. ఆదర్శవంతమైన విలువలతో రాజకీయాలు చేయడం కమ్యూనిస్టులకకే సాధ్యమని సుందరయ్య జీవితం నిదర్శనమని వారు కొనియాడారు. వ్యవసాయ కార్మికులకు కూలీ పెరగాలని, భూమి పంచాలని సంఘం పెట్టి కూలీ భూమి పోరాటాలు చేశారని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు కొయ్యడ చంద్రమోహన్, నాయకులు ఇనాయత్ఖాన్, డి.పోచయ్య, ఎన్.భవాని, పి.ఐశ్వర్య, ప్రవళిక తదితరులు పాల్గొన్నారు.



సుందరయ్య చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న సిపిఎం నాయకులు